మా కలం.. మీ గళం..

# మన గళం

RNI : APTEL/ 2017/74310

దిన పత్రిక

కృష్ణానదిపై కేరళ తరహా హౌస్‌బోట్ టూరిజం

## విజయవాడకు కొత్త ఆకర్షణ



2లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 173 | శనివారం | 20 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4



మహిళా న్యాయవాదిపై

## దారుణం

- క్లయింట్ కేసులో జోక్యం.. హింస, లైంగిక వేధింపుల ఆరోపణలు
- సీసీటీవీ ఫుటేజ్ కోరిన సుప్రీంకోర్టు

మన గళం, న్యూఢిల్లీ : ఒక క్లయింట్‌కు న్యాయ సహాయం అందించేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళా న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, శారీరకంగా హింసించి, లైంగికంగా వేధించారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టార్126 పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకున్నట్లు బాధిత న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపింది. తీవ్రంగా గాయపడిన తన క్లయింట్ వినయ్ సింఘాల్ ఫిర్యాదుపై తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని 2 లో..

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి

# దర్శనానికి భారత ఎన్నికల కమిషనర్





మనగళం శ్రీశైలం : శుక్రవారం శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వార్ల దర్శనార్థం శ్రీశైలానికి విచ్చేసిన భారత ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారికి శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వివేక్ యాదవ్ గారు, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ గారు, జాయింట్ కలెక్టర్ శ్రీ కొల్లాబత్తుల కార్తీక్ గారు, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు గారు తదితరులు. ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారి ధర్మపత్ని శ్రీమతి అనురాధ కుమార్ గారు కూడా స్వామి వార్ల దర్శనార్థం హాజరయ్యారు.

కర్ణాటక సీఎం

## పీఠంపై స్పష్టత



- పవర్ షేరింగ్ లేదని అసెంబ్లీలో సిద్దరామయ్య ప్రకటన
- కాంగ్రెస్‌లో అంతర్గత చర్చలు కొనసాగుతున్నాయా?

మన గళం, బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి పీఠంపై గత కొంతకాలంగా కొనసాగుతున్న ఊహాగానాలకు సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీ వేదికగా తెరదించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తనకు ఎలాంటి పవర్ షేరింగ్ ఒప్పందం లేదని, పూర్తి ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా 2 లో..

క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ లింక్‌లను

## పంపిస్తున్న సైబర్ నేరగాళ్లు

- ఫేస్బుక్, వాట్సాప్ మరియు ఇతర సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్న మెసేజ్స్ కు స్పందించకండి..
- తెలియని లింకులను, ఫైల్ లను క్లిక్ చేయవద్దు...సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు



మనగళం శ్రీశైలం : క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని నంద్యాల జిల్లా ప్రజలు అప్రమతంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ గారు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశా లను లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దు. చిన్నగా 500 గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండని వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా 2 లో..

## భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శ్రీశైలం పర్యటన




మనగళం శ్రీశైలం : భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శుక్రవారం శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వారి దర్శనార్థం శ్రీశైలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి వారి దర్శనం చేసుకోవడం తనకు, తన కుటుంబానికి లభించిన గొప్ప అదృష్టమని తెలిపారు. పరమశివుని మరియు అమ్మవారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. శ్రీశైల దేవస్థానంలో శివశక్తుల దర్శనం తనకు, తన కుటుంబానికి మరపురాని అనుభూతిగా నిలుస్తుందని పేర్కొన్నారు. చివరగా "జై భారత్.. జై హింద్" అని నినాదం చేశారు.

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పేరు మార్పుపై

## రాజకీయ దుమారం




- వీజీజీ రామ్ జీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం
- 12 గంటలపాటు పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల ధర్నా

మన గళం, న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చుతూ తీసుకొచ్చిన బిల్లును పార్లమెంటు ఆమోదించడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం చెలరేగింది. వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్)గా, సంక్షిప్తంగా వీజీజీ రామ్ జీగా పేరుమార్చే బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్య గురువారం పార్లమెంటు ఆమోదించింది. రాజ్యసభలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ప్రస్తుత ఎంజీఎన్ ఆర్‌ఈజీఏ పథకం నుంచి మహాత్మా గాంధీ 2 లో..

# మీ సాయం మరువం

- దేశానికి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- సీఎంకు బ్రిక్స్ 11వ సమావేశం ఆల్బమ్ అందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : భారత దేశానికి, మా ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు కల్పించిన సీఎం చంద్రబాబుకు నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీ సాయం మరువం అన్నారు. న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం సీఎం నారా చంద్రబాబు నాయుడకు బ్రిక్స్ 11వ శిఖరాగ్ర సమా వేశం ఆల్బమ్ ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రెజిల్ (బ్రాసీలియా) లో నిర్వహించిన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ పుస్తకాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ పుస్తకంలో బ్రెజిల్‌లో జరిగిన 11 వ బ్రిక్స్ సమావేశాల్లో నేను పాల్గొన్న ఫోటోలు, ప్రసంగాలు, చర్చలు 2 లో..



## మహిళా న్యాయవాదిపై పోలీస్ స్టేషన్‌లో దారుణం

పట్టుబట్టినందుకే తనను అక్రమంగా నిర్బంధించారని ఆమె ఆరోపించింది.డిసెంబర్ 3న అర్ధరాత్రి తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తనను స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు అక్కడి సిబ్బంది అర్ధరాత్రి 12.30 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సమయంలో తనను లైంగికంగా వేధించారని, నల్లకోటును చించి, రహస్య వీడియో రికార్డర్ ఉందన్న అనుమానంతో దుస్తులు తనిఖీ చేశారని తెలిపారు. ఈ తనిఖీల్లో తన శరీరాన్ని తాకుతూ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాదు, ఒక పోలీస్ అధికారి తన మెడపై పిస్టల్ ఉంచి మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడని, లేదంటే 'నకిలీ ఎన్‌కౌంటర్'లో చంపుతామని భయపెట్టినట్లు ఆమె వెల్లడించారు. తనతో పాటు క్లయింట్ మొబైల్ ఫోన్లలో ఉన్న వీడియో ఆధారాలను పోలీసులు బలవంతంగా డిలీట్ చేశారని పేర్కొన్నారు. సుమారు 14 గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో తాను ఎదుర్కొన్న హింసతో తన ప్రాణాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు తీవ్ర ముప్పు ఏర్పడిందని న్యాయవాది సుప్రీంకోర్టుకు వివరించారు.ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నోయిడా సెక్టార్126 పోలీస్ స్టేషన్‌లో ఘటన జరిగిన సమయానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను జనవరి 7లోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. అంతవరకు ఆ ఫుటేజ్ తొలగించకుండా సంరక్షించాలని నోయిడా పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన సూచనలు జారీ చేసింది. ఈ కేసులో న్యాయవ్యవస్థ జోక్యం కీలకమవుతుందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

## కర్ణాటక సీఎం పీఠంపై స్పష్టత

కొనసాగుతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి మద్దతు తనకేనని కూడా ఆయన ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడిన సిద్దరామయ్య, తాను గతంలో ఒకసారి పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేశానని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యానని, ఈసారి కూడా ఐదేళ్లు కొనసాగుతానన్న నమ్మకం ఉందని చెప్పారు. పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలన్న నిర్ణయం ఎప్పుడూ జరగలేదని స్పష్టంగా పేర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలో ఇదే అంశంపై ఆయన వ్యాఖ్యానించడం ఇది రెండోసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత సీఎం పదవిని సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు పంచుకుంటారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ ప్రచారం ఆధారంగా మధ్యంతరంగా సీఎం మార్పు జరుగుతుందని డీకే శివకుమార్ వర్గం ఆశలు పెట్టుకుంది. అయితే, తాజా ప్రకటనలతో ఆ అంచనాలపై సిద్దరామయ్య నీళ్లు చల్లినట్లయ్యింది. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి చర్చకు వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం రాత్రి మంత్రి సతీశ్ జార్కిహోళి ఇచ్చిన విందుకు సిద్దరామయ్యతో పాటు ఆయనకు సన్నిహితులైన కొందరు మంత్రులు హాజరయ్యారు. ఈ విందుకు డీకే శివకుమార్‌కు ఆహ్వానం అందలేదన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే, దీనిపై డీకే శివకుమార్ స్పందిస్తూ విందు భోజనానికి వెళ్లడంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ అంశం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఇరు వర్గాల మధ్య సయోధ్య కోసం చర్చలు జరుగుతున్నాయని, 2028 ఎన్నికల్లో డీకే శివకుమార్‌కు మద్దతిస్తానని సిద్దరామయ్య ప్రతిపాదించినట్లు కూడా రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## ఎంజీఎన్‌ఆర్ఈజీఏ పేరు మార్పుపై రాజకీయ దుమారం

పేరు తొలగించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఈ నిర్ణయం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించాయి. బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో ధర్నాకు దిగారు. సుమారు 12 గంటలపాటు నిరసన కొనసాగించడం గమనార్హం. కొత్త బిల్లు రైతులు, గ్రామీణ పేదలకు వ్యతిరేకమని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశంలో పేదల జీవనాధారంగా మారిందని, అలాంటి పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ ప్రజల భావోద్వేగాలను గాయపరిచిన చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయంతో గ్రామీణ కార్మికుల హక్కులు దెబ్బతింటాయని కూడా ఆందోళన వ్యక్తం చేశారు.పార్లమెంటు ఆమోదంతో బిల్లు చట్టరూపం దాల్చే దిశగా ముందుకెళ్లినా, దీనిపై పోరాటం ఆగదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రకటించాయి. ఈ అంశం రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ లింక్ లను పంపిస్తున్న సైబర్ నేరగాళ్లు

పురిగొల్పుతుంది.కావున ఎటువంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై మరియు ఫైల్ క్లిక్ చేయవద్దని, అదేవిధంగా మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు. మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని జిల్లా ఎస్పీ గారు హెచ్చరించారు. ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు మరియు మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చెయ్యాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ గారు తెలిపారు.

## మీ సాయం మరువం

పొందుపరచడం అదృష్టంగా, గర్వకారణంగా, అపార గౌరవంగా, అనుభవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు (ఏఐ), వాతావరణ మార్పు, ప్రజాస్వామ్య విలువలు వంటి కీలక అంశాలపై జరిగిన చర్చల్లో భారతదేశం తరఫున స్వరం వినిపించడం నిజంగా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. భారత దేశానికి, మా ప్రజలకు సేవ చేసే ప్రతి అవకాశం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కల్పించడం ఆనందంగా ఉందని, బాధ్యతతో పనిచేస్తున్నానన్న సంతృప్తి ఇస్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

## కృష్ణానదిపై కేరళ తరహా హౌస్‌బోట్ టూరిజం
## విజయవాడకు కొత్త ఆకర్షణ

- పర్యాటక రంగానికి కొత్త ఊపు
- భవానీ దీవి -ప్రకాశం బ్యారేజ్‌కు అదనపు ఆకర్షణ
- ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



మన గళం డెస్క్ : కృష్ణానదిపై కేరళ తరహా లగ్జరీ హౌస్‌బోట్ టూరిజాన్ని ప్రారంభించేందుకు విజయవాడ సిద్ధమవుతోంది. కేరళ బ్యాక్‌వాటర్స్‌ను తలపించేలా రూపొందించిన ఈ హౌస్‌బోట్ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కొత్త ఊపునిచ్చే ప్రయత్నం జరుగుతోంది. నది సహజ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ హౌస్‌బోట్లలో సుందరమైన నది ప్రయాణాలతో పాటు రాత్రి బస సౌకర్యం కూడా ఉండనుంది.ఆధునిక వసతులతో కూడిన సంప్రదాయ డిజైన్‌లో బోట్లు రూపొందించనున్నారు. స్థానిక ఆహార రుచులను పరిచయం చేస్తూ, విశ్రాంతి, వినోద కార్యక్రమాలు కూడా అందుబాటులోకి తీసుకురావాలని టూరిజం శాఖ భావిస్తోంది. కుటుంబాలు, పర్యాటకులు, కార్పొరేట్ ట్రావెల్‌కు అనువుగా ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించనున్నారు. భవానీ దీవి, ప్రకాశం బ్యారేజ్ వంటి ఇప్పటికే ఉన్న పర్యాటక కేంద్రాలకు ఈ హౌస్‌బోట్ టూరిజం మరో అదనపు ఆకర్షణగా నిలవనుంది. కృష్ణానది ఒడ్డున పర్యాటక కార్యకలాపాలు పెరగడంతో విజయవాడ నగరానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటక రంగం విస్తరించడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. హౌస్‌బోట్ నిర్వహణ, ఆతిథ్య సేవలు, ఆహార సరఫరా వంటి రంగాల్లో ఉద్యోగాలు కలుగుతాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా కృష్ణానదిపై కేరళ తరహా హౌస్‌బోట్లు విజయవాడ పర్యాటక ముఖచిత్రాన్ని కొత్త దశకు తీసుకెళ్లనున్నాయి.

## పిఠాపురంలో స్థానిక ఎన్నికల వాతావరణాన్ని
## తలపించిన జనసేన కమిటీల నియామకం

- బ్యాలెట్ విధానంతో క్షేత్రస్థాయి నేతల ఎంపిక
- 28 గ్రామాల్లో గ్రామ, బూత్, వార్డు కమిటీలు పూర్తి
- అర్ధరాత్రి వరకు సాగిన ప్రజాస్వామ్య ప్రక్రియ



మన గళం, పిఠాపురం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ క్షేత్రస్థాయి కమిటీల నియామకం స్థానిక ఎన్నికలను తలపించేలా ఉత్సాహంగా కొనసాగుతోంది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ నేతృత్వంలో ఈ నియామక ప్రక్రియ పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. చేబ్రోలు లోని జనసేన పార్టీ కార్యాలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ కోసం ఏళ్లుగా పనిచేస్తున్న క్షేత్రస్థాయి జనసైనికులకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నారు. కమిటీల్లో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొనడంతో, పలుచోట్ల బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ నిర్వహించి సభ్యులను ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో ప్రజలే తమ నాయకులను ఎన్నుకునే విధంగా ఈ ప్రక్రియ సాగుతూ, నియోజకవర్గంలో రాజకీయ ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఎండపల్లి, విరవ, విరవాడ, మంగుతుర్తి, ఎఫ్.కే. పాలెం, వన్నెపూడి, కొడవలి, ఎల్.ఎన్. పురం, పి. తిమ్మాపురం, దుర్గాడ, మాధవాపురం, కోలంక, చిన్న జగ్గంపేట, చెందుర్తి, బి. ప్రత్తిపాడు గ్రామాలకు ఓటింగ్ విధానం ద్వారా కమిటీలను ఎంపిక చేశారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు సాగిన ఈ కార్యక్రమంలో 174 వార్డులకు, 48 బూత్‌లకు, 15 గ్రామాలకు ఇంచార్జులను ఎన్నుకున్నారు. మూడు రోజుల వ్యవధిలో మొత్తం 28 పంచాయతీల పరిధిలో 294 వార్డులు, 86 బూత్‌లు, 28 పంచాయతీ ఇంచార్జులతో జనసేన కమిటీలు పూర్తయ్యాయి. ఎన్నికైన సభ్యులకు ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ నియామక పత్రాలు అందజేసి, ప్రమాణ స్వీకారం చేయి ంచి బాధ్యతలు అప్పగించారు. మిగిలిన గ్రామాలకు కూడా ఇదే విధంగా ఈ రోజు, రేపు కమిటీల నియామకం కొనసాగుతుందని, శనివారంతో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. జనసేన పార్టీ కొత్త రాజకీయ సంస్కృతికి నిదర్శనం గా పిఠాపురంలో జరుగుతున్న ఈ కమిటీల నియామకం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా మారిందని జనసైనికులు అభిప్రాయపడుతున్నారు.

## ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్క్ లు

- 25 వ తేదీ వరకు సుపరిపాలన వారోత్సవాలు
- కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 19 నుండి 25 వ తేదీ వరకు సుపరిపాలన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. సుపరిపాలన వారోత్సవాలు– గ్రామాల వైపు పరిపాలన కార్యక్రమంలో భాగంగా అన్ని మండల కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి 25 వ తేదీ వరకు గుడ్ గవర్నెన్స్ వీక్ – గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కి ఓర్)ను నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం నుండి జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు చేరువ చేయడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అని, ఇందులో భాగంగా కలెక్టరేట్ లో, అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో, మండల కార్యాలయాల్లో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించేందుకు స్పెషల్ డెస్క్ లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అలుపెరుగని పోరాట యోధుడు బీటీ రణదివే

మనగళం, కర్నూలు సిటీ : సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బీటీ రణదివే అలుపెరుగని పోరాట యోధుడు అని సీఐటీయూ జిల్లా అధ్య క్షులు పి.ఎస్.రాధాకృష్ణ జిల్లా నాయకులు టి.రాముడు,ఎం. గోపాలు కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం కార్మిక కర్షక భవన్ లో బీటీ రణదివే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1904 డిసెంబర్ 19న జన్మించిన కామ్రేడ్ బీటీఆర్ జీవితం కార్మిక వర్గ విము క్తి కోసం సాగిన పోరాటానికి ప్రతి రూపం అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, నగర కోశాధికారి సిహెచ్ సాయి బాబా, నగర ఉపా ధ్యక్షులు సుధాకరప్ప, యేసు రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, నగర కార్యదర్శి భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు నోమేస్వరి, సరిత తదితరులు పాల్గొన్నారు.



# బీహార్ సీఎం నితీష్ కుమార్ ను భర్తరాఫ్ చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : బీహార్ సీఎం నితీష్ కుమార్ ను తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్ ఎమ్ డి షరీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల, ఎన్ అలివేలు, జిల్లా కార్యదర్శి కె అరుణమ్మ, ఆవాజ్ నగర అధ్యక్షులు పి ఇక్బాల్ హుస్సేన్, ఉపాధ్యక్షులు, అబ్దుల్ నయీమ్, నూర్ వలి మాట్లాడారు. ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న సందర్భంగా ఒక ముస్లిం మహిళను తన బురఖా నకబ్ ఇడిచి తీసేయడం ఒక వీధి రౌడీని తలపించిందని విమర్శించారు. సీఎం స్థాయిలో ఉండి మహిళలకు రక్షణగా ఉండవలసిన నితీష్ కుమార్ ఒక మానసిక రోగి లా ఆ రకంగా వ్యవహరించడం హేయమైన చర్య అని ఖండించారు. కార్యక్రమంలో ఆవాజ్ నగర నాయకులు శాలి బాషా,




నూర్ అహ్మద్ ,హాజీ బాషా , యూనస్,అన్వర్, షబ్బీర్ ,అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ ,జావిద్, అబ్దుల్ జబ్బర్, జుబేర్ అహ్మద్ ,బాబు, మహిళా సంఘం నగర కార్యదర్శి పద్మ, సుజాత, జయమ్మ, వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఈ- ఫైలింగ్ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

మనగళం, కర్నూలు సిటీ : డిజిటల్ న్యాయపాలన వలన వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు డిజిటల్ పాలన, ఈ ఫైలింగ్ పై అవగాహన కలిగి ఉండాలని నంద్యాల జిల్లా పౌర సరఫరాల అధికారి జె. రవిబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయంకాలం నంద్యాల ఎస్టీ జోసెఫ్ హైస్కూల్ నందు ప్రధాన అధ్యాపకులు రాగిణి అధ్యక్షతన వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని డిసెంబరు 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నటువంటి వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు డిజిటల్ పాలన వ్యవస్థ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె. రవిబాబు డిజిటల్ పాలన, ఈ ఫైలింగ్ ప్రయోజనాలను వివరించారు. కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతలో లోపం, కొలతలలో తేడా ఉంటే వెంటనే అధికారులను కలిసి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. అలా పరిష్కారం కానీ ఫిర్యాదుల పైన వినియోగదారుడు జిల్లాస్థాయి కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమీషన్లో ఫిర్యాదు చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.




## ఆటో యూనియన్ జెండా ఆవిష్కరణ




మనగళం, కర్నూలు సిటీ : సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బళ్లారి చౌరస్తా సంతోష్ నగర్ కృష్ణానగర్, అంబేద్కర్ నగర్ వీకర్ సెక్షన్ కాలనీల ఆటో అడ్డాలలోలో ఆటో యూనియన్( సీఐటీయూ) జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూ సిటీ ఆటో యూనియన్(సీఐటీయూ) నగర అధ్యక్షులు ఎస్ హుస్సేన్ వలి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నభి, విజయ్, ప్రసాద్, మధు, నాగ శేషులు, శ్రీనివాసులు, రాజేష్, నరసింహులు, మధు, వెంకట్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణను కలిసిన బుడగ జంగం నాయకులు

మనగళం, కర్నూలు సిటీ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగను బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మందకృష్ణను తన నివాసంలో కలిసిన బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ నారాయణ తమ సామాజికవర్గ ప్రజల సమస్యలను వివరించారు. ప్రత్యేకించి క్యాస్ట్ సర్టిఫికెట్ లేనందున తమ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను మందకృష్ణకు వివరించారు. స్పందించిన మందకృష్ణ తనకు ఈ సమస్య తెలుసని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మందకృష్ణ మాదిను తాటికొండ నారాయణతోపాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి, తాటికొండ కొండయ్య, శిరిశాల మల్లిక, శిరిశాల రాంబాబు తదితరులు సన్మానించారు.



## అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం :లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు ( 05.12.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకు మార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టలకు దరఖాస్తు చేసుకోండి

మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్ట్ ల కొరకు న్యాయ వాదులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్ట్ కు న్యాయవాది వృత్తిలో ఏడేళ్ల అనుభవం కలిగిన సెషన్స్ కేసులు చేయగలిగిన న్యాయవాదులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్ట్ కు న్యాయ వాద వృత్తిలో మూడేళ్ల అనుభవం కలిగిన క్రిమినల్ కేసులు చేయగలిగిన న్యాయ వాదులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్ట్ ల అప్లికేషన్ జిల్లా కోర్టు వెబ్సైట్ నందు అందు బాటులో ఉందన్నారు. డిసెంబర్ 29వ తేదీ లోగా చెర్మన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా కోర్ట్ కాంపౌండ్, కర్నూలు అడ్రస్ కు తమ దరఖాస్తులను పంపాలని సూచించారు.



## ఇక మొబైల్‌లో చూపించే రైల్వే టికెట్లు చెల్లవు..

న్యూఢిల్లీ డిసెంబర్ 19, 2025 మనగళం : డిజిటల్ మోసాలను అరికట్టే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రిజర్వ్ చేయని బోగీల్లో ప్రయాణించే ప్రయాణికులు మొబైల్ ఫోన్‌లో చూపించే టికెట్లపై మాత్రమే ఆధారపడి ప్రయాణించడానికి అనుమతి ఉండదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. తప్పనిసరిగా టికెట్ భౌతిక ప్రింటౌట్ లేదా స్టేషన్ కౌంటర్‌లో తీసుకున్న కాగితపు టికెట్ ఉండాలని తాజాగా నిబంధనలు మార్చారు.ఇటీవల ఒక రైల్లో టికెట్ తనిఖీ సమయంలో టికెట్ ఇన్‌స్పెక్టర్‌కు కొన్ని టికెట్లపై అనుమానం రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. లోతుగా పరిశీలించగా, ఆ టికెట్లు ఏఐ సాంకేతికతతో నకిలీగా రూపొందించినవని అధికారులు గుర్తించారు. ఈ ఘటన తర్వాత రిజర్వ్ చేయని కంపార్ట్‌మెంట్లలో ప్రయాణించే టికెట్ల ధృవీకరణ విధానాన్ని మరింత కఠినతరం చేయాలని రైల్వే నిర్ణయించింది.గత కొంతకాలంగా ప్రయాణికులు యాప్ ద్వారా రిజర్వ్ చేయని టికెట్లను బుక్ చేసుకుని మొబైల్‌లో చూపిస్తూ ప్రయాణించేవారు. ఇది స్టేషన్ కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించినప్పటికీ, అదే సమయంలో నకిలీ టికెట్లకు అవకాశాన్ని కూడా పెంచిందని అధికారులు భావిస్తున్నారు.

## భగవత్ భక్తి తో శాంతి, సుఖ, సంతోషాలు

మనగళం, వెల్దుర్తి : భగవద్భక్తితో శాంతి, సుఖ,సంతోషాలు అంతటా విజయం సాధ్యమని తిరుమల, తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం మదార్ పురం గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధార్మిక సభా కార్యక్రమంలో ఆయన అనేక ఆధ్యాత్మిక విషయాలు తెలియపరిచారు. ముఖ్యంగా యువతరం తల్లిదండ్రులను గురువు, దైవాలను పెద్దలను ఎంతో భక్తిశ్రద్ధలతో సేవించాలని కోరారు. భగవత్ భక్తితో మెలిగే వారికి అంతట విజయమేన ని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్యావరణ పరిరక్షణ విభాగ్ జిల్లా ప్రముఖ్ తోటహరి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తులసి మొక్కలను ఇంటిలో పెంచుకోవాలని కోరారు. తద్వారా ఎంతో మంచి జరుగుతుందని, అదేవిధంగా ధర్మో రక్షిత రక్షిత‘ అని, వృక్షో రక్షిత రక్షిత‘ అని ప్రతి ఒక్కరూ పర్యావరణ రక్షణ కోసం విరివిగా ఎన్నో మొక్కలను పెంచాలని, గోవులను సంరక్షించాలని కోరారు. గత మూడు రోజులనుండి మదార్ పురం వేంకటేశ్వర స్వామి ఆలయం లో ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మదార్ పురం గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు, మదార్ పురం సర్పంచ్ జయలక్ష్మి,గ్రామ పెద్దలు, వైద్యం రామనాయుడు,తోట హరి కృష్ణ,హరి సింహ నాయుడు, బోగోలు వెంకటరామిరెడ్డి, రామచంద్ర, జనార్దన్ రెడ్డి, రంగన్న,గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీస్వామి అమ్మవార్లకు ఊయలసేవను



మనగళం శ్రీశైలం లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 19.12.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## ఎయిర్‌పోర్టులపై రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు..

డిసెంబర్ 19, 2025 మనగళం : గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ రాబోయే 5 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల అభివృద్ధిపై సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దేశంలో విమానయాన రంగం ప్రతి ఏడాది 15 నుంచి 16 శాతం వృద్ధి నమోదు చేయనుందన్న అంచనాల నేపథ్యంలో ఈ భారీ పెట్టుబడుల ప్రణాళికను రూపొందించినట్లు గ్రూప్ వెల్లడించింది.ఈ విషయాన్ని అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ జీత్ అదానీ వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో టెర్మినల్స్ విస్తరణ, రన్‌వేలు, కార్గో హబ్‌లు, లాజిస్టిక్స్ సదుపాయాల అభివృద్ధిపై ఈ పెట్టుబడులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.ఈ నెల 25న నవీ ముంబై విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు అదానీ గ్రూప్ ప్రకటించింది. ఈ విమానాశ్రయం గ్రూప్ విస్తరిస్తున్న ఎయిర్‌పోర్టుల పోర్ట్‌ఫోలియోలో కీలకంగా నిలవనుంది. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టులో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది.ప్రాథమిక దశలో ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ.19,650 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొదటి దశలో ఏడాదికి 2 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉండగా, భవిష్యత్‌లో దీన్ని విస్తరించి ఏడాదికి 9 కోట్ల మంది ప్రయాణికులను సేవలందించే స్థాయికి తీసుకెళ్లే ప్రణాళికలు ఉన్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా విమాన ప్రయాణాలు పెరుగుతున్న నేపథ్యంలో అదానీ గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయం విమానయాన రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కేశవ్ పై దాడి చేసిన శివరాంను అరెస్టు చేయాలి






మనగళం, కర్నూలు సిటీ : లాభం వస్తే పంచుకు తింటాం నష్టం వస్తే చంపుకు తింటాం అన్న చందంగా దళితులపై కలిసి ఉంటూనే దాడులు చేస్తున్నారని, కేశవ్ పై పట్టపగలు వెన్నెముక పక్కకు జరిగేలా దాడి చేసిన శివరాం, శివ, సిద్దు తో పాటు మరో పదిమంది పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. దాడికి గురై ఆదిత్య ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కేశవ్ ను కేవీపీఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం కేశవ్, శ్రీరామ్ కలిసి ప్రారంభించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం లో లాభాలు వచ్చినప్పుడు భాగాలు పంచుకొని, భూమి అమ్ముడుపోక ఆగిపోతే వేచి ఉండాల్సింది పోయి, డబ్బులు ఇవ్వాల్సిందే అంటూ దళితుడైన కేశవ కుటుంబం పై నానా రకాల అవమానాల పాలు చేయడం దుర్మార్గమన్నారు. రూ. 10 లక్షలు చెల్లించినా రూ. 17 లక్షల చెల్లించాలంటూ భయపెట్టి నోట్ రాయించుకున్నారని, డబ్బులు ఇచ్చేందుకు వెసులుబాటు లేదు అవసరమైతే భూమిని రాసిస్తామని చెప్పినా వినకుండా ఎమ్మిగనూరులో ఒంటరిగా ఉన్న కేశవ్ భార్య మహేశ్వరిని ఇబ్బంది పెట్టడమే కాకుండా, గురువారం ఉదయం కర్నూల్ చౌరస్తా లో ఒంటరిగా వెళ్తున్న కేశవ్ పై శివరాం 10 మందితో కలిసి మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి గురైన కేశవ్ కు వెన్నెముక పక్కకు జరగడంతో పాటు పది రోజుల బెడ్ రెస్ట్ అనంతరం ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెబుతున్నారంటే ఎంత తీవ్రంగా దాడి చేశారో అర్థమవుతుందన్నారు. దాడి చేసిన శివరాం తో పాటు మరో పది మందిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, కేశవ కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి విజయమ్మ, ఎన్ జి కృష్ణ, సహాయ కార్యదర్శి ఎం భాస్కర్, రాజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మదన గోపాల్, యేసు రాజు, రమణ, చిన్న రోశయ్య, నాయకులు ప్రకాశం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డేగలహాళ్‌లో గంజాయి సాగు గుట్టు రట్టు.

- రైతు పొలాలపై పోలీసుల దాడులు.
- కంది, మిరప పంటల మధ్య గంజాయి మొక్కలు...శివయ్య పై కేసు నమోదు.
- చిప్పగిరి మండలంలో అక్రమ సాగుపై పోలీసులు ఉక్కుపాదం, పోలీస్ మరియు వ్యవసాయ శాఖ సంయుక్త తనిఖీలు.







( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం డేగలహాళ్ గ్రామంలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న రైతును పోలీసులు గుర్తించి విస్తృతంగా దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన శివయ్య అనే రైతు తన వ్యవసాయ పొలాల్లో చట్టవిరుద్ధంగా గంజాయి పంటను సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 173లో కంది పంట, అలాగే సర్వే నెంబర్ 176లో మిరప పంట సాగు చేస్తున్న పొలాల్లో గంజాయి మొక్కలను మధ్యలో నాటినట్లు అధికారులు గుర్తించారు. సాధారణ పంటల మధ్య గంజాయి మొక్కలు దాచిపెట్టడం ద్వారా అధికారుల కంట పడకుండా సాగు చేయాలని ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ సీఐ లలితాదేవి, సివిల్ సీఐ శివ శంకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ చంగల్ రాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పొలాలను పూర్తిగా పరిశీలించి గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సాగు చేసిన గంజాయి మొక్కలను అక్కడికక్కడే తొలగించి నాశనం చేసినట్లు అధికారులు తెలిపారు. రైతు శివయ్యపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి సాగు వెనుక మరెవరి ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సాధారణ పంటల మధ్య గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని, మండల వ్యాప్తంగా పంటల తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమ గంజాయి సాగు లేదా రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ఆదోని జిల్లా సాధనకై ఆలూరులో నాయి బ్రాహ్మణులు నిరసన.

- డ్రమ్స్ తో నిరసన ర్యాలీ.







(ఆలూరు మనగళం):ఆలూరు జెఏసి అద్వర్యంలో ఆదోని ను జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఆలూరు పట్టణంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డ్రమ్స్ కొట్టి నిరసన తెలిపారు. అనంతరం రిలే దీక్షలో నాయి బ్రాహ్మణ సంఘం గౌరవ అద్యక్షులు మంగలి నరసింహులు, అధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు గుళ్యం రామాంజినేయులు, వెంకటేశ్వర్లు, సోమశేఖర్, ధనుంజయ్, రంగస్వామి, మల్లికార్జున, నాగరాజు, గోపి దీక్షలో కూర్చున్నారు. వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం పూర్తిస్థాయిలో ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ, విద్యార్థి, కుల, ఉద్యోగ సంఘాలు మద్దతు ఇవ్వాలని జెఏసి నాయకులు భూపేష్, కత్తి రామాంజనేయులు, రామాంజినేయులు, ఎల్లప్ప, చంద్రకాంత్ రెడ్డి కోరారు.దీక్షలకు ఆదోని జెఏసి నాయకులు ఆదినారాయణ రెడ్డి సంఘీభావం ప్రకటించారు.



# సంపాదకీయం

## అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం

ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నా, ఆ వేగం మానవత్వాన్ని మరిచిపోతున్న పరిస్థితులు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. యుద్ధాల మంటలు, శరణార్థుల వేదనలు, ఆకలి అరుపులు, అసమానతల గోడలు ఇవన్నీ నేటి ప్రపంచానికి ప్రతిరోజూ కనిపిస్తున్న దృశ్యాలే. ఇలాంటి సమయంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 20న నిర్వహించే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఒక సాధారణ క్యాలెండర్ గుర్తుగా కాకుండా, మానవ సమాజానికి ఇచ్చే హెచ్చరికగా నిలుస్తోంది. మనం ఎటు వెళ్తున్నాం? మన ప్రయాణం మానవత్వం వైపేనా? అన్న ప్రశ్నలను ఈ రోజు ముందుంచుతోంది. మానవ ఐక్యత అనేది కేవలం దయతో చేయబడే సహాయం కాదు. అది నైతిక బాధ్యత. ఒక మూల దేశంలో పుట్టిన శిశువు ఆకలితో అలమటిస్తే, మరో మూల దేశంలో ఉన్న సంపన్న సమాజం దానికి బాధ్యత వహించాల్సిందే. ఎందుకంటే ప్రపంచం నేడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది. ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్యం, వాతావరణం, ఆరోగ్యం ఏది కూడా ఒంటరిగా లేదు. అయినా, బాధలు పంచుకునే విషయంలో మాత్రం సరిహద్దులు గీయడం మానవత్వానికి విరుద్ధం. ఈ అసమాన ధోరణినే ఐక్యరాజ్యసమితి ప్రశ్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. కోట్లాది మంది కనీస అవసరాల కోసం పోరాడుతుండగా, కొంతమంది అపారమైన సంపదను కూడబెట్టుకుంటున్నారు. ఈ అంతరం సమాజాన్ని మౌనంగా కాకుండా, ప్రమాదకరంగా చీల్చేస్తోంది. పేదరికం కేవలం ఆదాయ లోపం కాదు. అది అవకాశాల లేమి, గౌరవం కోల్పోవడం, భవిష్యత్తుపై ఆశలు మసకబారడం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఈ వాస్తవాలను ప్రపంచం కళ్లముందు ఉంచుతోంది. అసమానతలు తగ్గించకుండా శాంతి సాధ్యం కాదని. భారతదేశంలో శతాబ్దాల క్రితమే "వసుధైక కుటుంబకం" అనే భావన జన్మించింది. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ తత్వం నేటికీ ప్రాసంగికమే. కానీ ఆ ఆలోచనను మనం ఎంతవరకు ఆచరణలో పెట్టాం అన్నది ప్రశ్న. కులం, మతం, భాష, ప్రాంతం పేర్లతో మనమే మన మధ్య గోడలు కట్టుకుంటున్నాం. ఐక్యత గురించి మాట్లాడే సమాజమే విభజనలకు వేదికగా మారడం ఒక పెద్ద విరోధాభాసం. ఈ రోజు మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పు మానవ ఐక్యత అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది. ఒక దేశం విడుదల చేసే కాలుష్యం ప్రభావం మరో దేశంపై పడుతోంది. సముద్ర మట్టం పెరుగుదల, కరువు, వరదలు ఇవి సరిహద్దులను గౌరవించవు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం కూడా సామూహికంగా ఉండాల్సిందే. దేశాల స్వార్థ రాజకీయాలు కొనసాగితే, భవిష్యత్ తరాలకు భద్రమైన ప్రపంచం మిగలదు. ఐక్యత అనేది ఇక ఎంపిక కాదు అది అవసరం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం మనకు చెప్పే అసలు సందేశం స్పష్టం. ఐక్యత అంటే బలహీనుల పక్షాన నిలబడటం. అన్యాయాన్ని ప్రశ్నించడం. లాభం కంటే విలువలను ముందుంచడం. ప్రభుత్వాలు విధానాల్లో, సమాజాలు ప్రవర్తనలో, వ్యక్తులు ఆలోచనల్లో మార్పు తెచ్చినప్పుడే ఈ దినోత్సవానికి అర్థం ఉంటుంది. లేదంటే ఇది కూడా మరొక పేరాగ్రాఫ్‌గా, మరొక తేదీగా మిగిలిపోతుంది. ప్రపంచ భవిష్యత్తు ఆయుధాల్లో లేదు, సంపదలో లేదు. అది మన మధ్య ఉన్న మానవ బంధాల్లోనే ఉంది. ఐక్యత లేకుండా శాంతి లేదు. న్యాయం లేకుండా ఐక్యత లేదు. మానవత్వం లేకుండా అభివృద్ధి లేదు. ఈ సత్యాన్ని అంగీకరించిన రోజే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం నిజమైన విజయం సాధించినట్టవుతుంది. ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నా, ఆ వేగం మానవత్వాన్ని మరిచిపోతున్న పరిస్థితులు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. యుద్ధాల మంటలు, శరణార్థుల వేదనలు, ఆకలి అరుపులు, అసమానతల గోడలు ఇవన్నీ నేటి ప్రపంచానికి ప్రతిరోజూ కనిపిస్తున్న దృశ్యాలే. ఇలాంటి సమయంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 20న నిర్వహించే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఒక సాధారణ క్యాలెండర్ గుర్తుగా కాకుండా, మానవ సమాజానికి ఇచ్చే హెచ్చరికగా నిలుస్తోంది. మనం ఎటు వెళ్తున్నాం? మన ప్రయాణం మానవత్వం వైపేనా? అన్న ప్రశ్నలను ఈ రోజు ముందుంచుతోంది. మానవ ఐక్యత అనేది కేవలం దయతో చేయబడే సహాయం కాదు. అది నైతిక బాధ్యత. ఒక మూల దేశంలో పుట్టిన శిశువు ఆకలితో అలమటిస్తే, మరో మూల దేశంలో ఉన్న సంపన్న సమాజం దానికి బాధ్యత వహించాల్సిందే. ఎందుకంటే ప్రపంచం నేడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది. ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్యం, వాతావరణం, ఆరోగ్యం ఏది కూడా ఒంటరిగా లేదు. అయినా, బాధలు పంచుకునే విషయంలో మాత్రం సరిహద్దులు గీయడం మానవత్వానికి విరుద్ధం. ఈ అసమాన ధోరణినే ఐక్యరాజ్యసమితి ప్రశ్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. కోట్లాది మంది కనీస అవసరాల కోసం పోరాడుతుండగా, కొంతమంది అపారమైన సంపదను కూడబెట్టుకుంటున్నారు. ఈ అంతరం సమాజాన్ని మౌనంగా కాకుండా, ప్రమాదకరంగా చీల్చేస్తోంది. పేదరికం కేవలం ఆదాయ లోపం కాదు. అది అవకాశాల లేమి, గౌరవం కోల్పోవడం, భవిష్యత్తుపై ఆశలు మసకబారడం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఈ వాస్తవాలను ప్రపంచం కళ్లముందు ఉంచుతోంది. అసమానతలు తగ్గించకుండా శాంతి సాధ్యం కాదని. భారతదేశంలో శతాబ్దాల క్రితమే "వసుధైక కుటుంబకం" అనే భావన జన్మించింది. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ తత్వం నేటికీ ప్రాసంగికమే. కానీ ఆ ఆలోచనను మనం ఎంతవరకు ఆచరణలో పెట్టాం అన్నది ప్రశ్న. కులం, మతం, భాష, ప్రాంతం పేర్లతో మనమే మన మధ్య గోడలు కట్టుకుంటున్నాం. ఐక్యత గురించి మాట్లాడే సమాజమే విభజనలకు వేదికగా మారడం ఒక పెద్ద విరోధాభాసం. ఈ రోజు మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పు మానవ ఐక్యత అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది. ఒక దేశం విడుదల చేసే కాలుష్యం ప్రభావం మరో దేశంపై పడుతోంది. సముద్ర మట్టం పెరుగుదల, కరువు, వరదలు ఇవి సరిహద్దులను గౌరవించవు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం కూడా సామూహికంగా ఉండాల్సిందే. దేశాల స్వార్థ రాజకీయాలు కొనసాగితే, భవిష్యత్ తరాలకు భద్రమైన ప్రపంచం మిగలదు. ఐక్యత అనేది ఇక ఎంపిక కాదు అది అవసరం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం మనకు చెప్పే అసలు సందేశం స్పష్టం. ఐక్యత అంటే బలహీనుల పక్షాన నిలబడటం. అన్యాయాన్ని ప్రశ్నించడం. లాభం కంటే విలువలను ముందుంచడం. ప్రభుత్వాలు విధానాల్లో, సమాజాలు ప్రవర్తనలో, వ్యక్తులు ఆలోచనల్లో మార్పు తెచ్చినప్పుడే ఈ దినోత్సవానికి అర్థం ఉంటుంది. లేదంటే ఇది కూడా మరొక పేరాగ్రాఫ్‌గా, మరొక తేదీగా మిగిలిపోతుంది. ప్రపంచ భవిష్యత్తు ఆయుధాల్లో లేదు, సంపదలో లేదు. అది మన మధ్య ఉన్న మానవ బంధాల్లోనే ఉంది. ఐక్యత లేకుండా శాంతి లేదు. న్యాయం లేకుండా ఐక్యత లేదు. మానవత్వం లేకుండా అభివృద్ధి లేదు. ఈ సత్యాన్ని అంగీకరించిన రోజే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం నిజమైన విజయం సాధించినట్టవుతుంది.

## 30న ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు



మనగళం, బనగానపల్లె : బనగానపల్లె నగర శివాల్లోని భానుముక్కల గ్రామానికి చెందిన రవలకొండపై వెలసిన శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీన మంగళవారం ధనుర్మాసం కావడం విశేషం. అలాగనే ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరుగునని, ఉత్తరం గా ఉండే మెట్ల మీదుగా స్వామివారి దర్శనము ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రధాన అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి తెలిపారు. ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఆయన భక్తులకు పిలుపునిచ్చారు.

## రాఘవేంద్రుని దర్శించుకున్న కూటమినేతలు...






నందవరం డిసెంబర్ 19 మనగళం న్యూస్ పుణ్యక్షేత్రమయిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీ శుభుదేంద్ర తీర్థుల స్వామి వారిని కలిసిన కూటమి ప్రభుత్వం నాయకులు ఈ సందర్భంగా టిడిపి జిల్లా అద్యక్షులు శ్రీ తిక్కారెడ్డి గ మరియు బిజెపి నాయకులు ఆత్మ నిర్బర్ భారత్ సంకల్ప్ అభియన్ జిల్లా కోఆర్డినేటర్ ఎమ్మిగనూరు మరియు మంత్రాలయం ప్రొగ్రాము ఇంచార్జి శ్రీ గురురాజ్ దేశాయ్ మట్లాడుచూ అదోని జిల్లా ఏర్పాటుకై అన్ని వర్గాలవారు కృషి చేస్తున్నారు కాబట్టి మీ వంతు సహాయసహకారం కావాలని స్వామిజి వారిని కోరారు. స్వాములవారు స్పందిస్తూ మన ప్రాంతీయ వాసుల అభివృద్ధి కొరకు అదోని జిల్లా యేర్పాటుకై శ్రీ రాఘవేంద్ర స్వాములవారి ఆసీస్సులు తప్పకుండా ఉంటాయని అన్నారు. అలాగే తొందరలొనే అదోని జిల్లా ఏర్పాటుపై కేంద్ర మంత్రులతో కూడా మాట్లాడతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రాలయం టిడిపి నాయకులు శ్రీ పన్నగ వెంకటేశ్ స్వామి గారు, విజయ్ మరియు నందవరం మాజీ సర్పంచి ఎల్ ఎల్ సి చైర్మన్ రామన్నగౌడ్ కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఏపీ ఎన్జీఓస్ ఎమ్మిగనూరు ఎన్నికలు ఏక గ్రీవం



మనగళం, ఎమ్మిగనూరు : ఏపీ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఎమ్మిగనూరు తాలూకా ఎన్నికలు ఎమ్మిగనూరు ఎన్జీవో భవనంలో నిర్వహించారు. ఎన్నికలకు అధికారిగా కర్నూలు జిల్లా అడహక్ కమిటీ మెంబర్ కోదండ రామయ్య, సహాయ ఎన్నికల అధికారిగా సాయిబాబా, పరిశీలకులుగా నాగేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. మొత్తం 11 పోస్టులకు 11 నామినేషన్ వేశారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ వచ్చినట్లు పరిగణించిన ఎన్నికల అధికారి ఏకగ్రీవం చేశారు. ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షులుగా మద్దిలేటి (ఉన్నత విద్యాశాఖ), సహ అధ్యక్షులుగా శివరామిరెడ్డి (మెడికల్ డిపార్ట్మెంట్), సురేష్ వరప్రసాద్ (మెడికల్ డిపార్ట్మెంట్), టీవీ శ్రీరాజ్ (ఉన్నత విద్యాశాఖ), రామచంద్ర యాదవ్ (జీఎస్ డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్), కార్యదర్శిగా వరప్రసాద్ (పశుసంవర్ధక శాఖ), సంయుక్త కార్యదర్శులుగా సురేఖ (పశుసంవర్ధక శాఖ), విశ్వనాథ రెడ్డి (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్), హారతి దేవి (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్), మహిళా సంయుక్త కార్యదర్శిగా శాంతమ్మ (మెడికల్ డిపార్ట్మెంట్), కోశాధికారిగా తిరుమల్ రెడ్డి (వ్యవసాయ శాఖ) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కోదండరామయ్య, సహా ఎన్నికల అధికారి సాయి బాబా మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులందరూ సంఘ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. సమస్యలపై తరచూ సమావేశాలు నిర్వహించి ఉద్యోగుల్లో చైతన్యం నింపాలని సూచించారు.

## కేవలం రూ.1748తో 336 రోజుల వ్యాలిడిటీ..

హైదరాబాద్ డిసెంబర్ 19, 2025 మనగళం :. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం మొబైల్ సేవలు వినియోగించాలనుకునే వారికి రిలయన్స్ జియో ఒక ఆకర్షణీయమైన రీఛార్జ్ ప్లాన్‌ను అందుబాటులో ఉంచింది. కేవలం రూ.1748 చెల్లిస్తే ఏకంగా 336 రోజుల వ్యాలిడిటీ లభించే ఈ ప్లాన్ ప్రస్తుతం వినియోగదారుల్లో మంచి ఆదరణ పొందుతోంది.ఈ ప్లాన్ ముఖ్యంగా డేటా అవసరం తక్కువగా ఉండే వారికి అనుకూలంగా రూపొందించారు. ఇంట్లో వైఫై సౌకర్యం ఉన్నవారు, లేదా ప్రధానంగా కాలింగ్ అవసరాలకే మొబైల్ ఉపయోగించే వారు ఈ ప్లాన్‌ను ఎంచుకుంటున్నారు. ఈ రీఛార్జ్‌తో అపరిమిత వాయిస్ కాలింగ్ సదుపాయం లభించడంతో పాటు మొత్తం 3600 ఎస్ఎంఎస్‌లు కూడా అందుబాటులో ఉంటాయి.అయితే ఈ ప్లాన్‌లో మొబైల్ డేటా ఇవ్వడం లేదు. అవసరమైతే వినియోగదారులు అదనంగా డేటా ప్యాక్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. దీర్ఘకాల వ్యాలిడిటీ కావాలనుకునే వారికి ఇది తక్కువ ఖర్చుతో మంచి ఎంపికగా మారింది. తల్లిదండ్రులు, వృద్ధులు వంటి వారి కోసం ఈ ప్లాన్‌ను ఎక్కువగా తీసుకుంటున్నట్లు టెలికాం వర్గాలు చెబుతున్నాయి.ఇక అదనపు ప్రయోజనాల విషయానికి వస్తే, ఈ రీఛార్జ్‌తో జియో టీవీ, జియో క్లౌడ్ వంటి సేవలకు ఉచిత యాక్సెస్ లభిస్తుంది. దీర్ఘకాలం రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేకుండా ఒకేసారి చెల్లించి, ఏడాదికి సమీప కాలం సేవలు పొందడం ఈ ప్లాన్ ప్రత్యేకతగా చెప్పవచ్చు.మొత్తంగా చూస్తే, తక్కువ ధర, ఎక్కువ వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్ వంటి ప్రయోజనాలతో రూ.1748 జియో ప్లాన్ కాలింగ్ అవసరాలకే మొబైల్ వినియోగించే వారికి బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది.

## మహిళలందరూ ఇంటివద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకోండి..ఎంపీడీవో సాల్మన్





మన గళం సంజామల మహిళలందరూ ఇంటి వద్దనే పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో సాల్మన్ శుక్రవారం అన్నారు.కోయిలకుంట్ల డివిజన్‌లోని సంజామల మండల సమైక్య కార్యాలయం, సంజామల నందు శుక్రవారం వ్యవసాయ శాఖ, రాజు‌నా మరియు అనుబంధ శాఖల అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయ విభాగం ఖీమీ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గడం, నేల సారవంతత పెరగడం, పంట దిగుబడులు మెరుగుపడడం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.వీణూ సాల్మన్ మాట్లాడుతూ మహిళలందరూ ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలను కుటుంబ అవసరాలకు వినియోగించడంతో పాటు గ్రామంలోని ఇతర కుటుంబాలకు కూడా అందించాలన్నారు. దీని ద్వారా కుటుంబాల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా గ్రామస్థాయిలో సమగ్ర ఆరోగ్యాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగి, రైతులు అధిక ఆదాయం పొందగలరని తెలిపారు.రాజు‌నా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గురుస్వామి మాట్లాడుతూ సంఘాలలోని ప్రతి మహిళా సభ్యురాలు ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని, పొలం ఉన్న మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి మెరుగైన ఆదాయం సాధించే దిశగా ముందుకు రావాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన చీఖీూ రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అమలు విధానాలు, నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫామింగ్ (చీవీచీఖీ) లక్ష్యాలు మరియు కార్యక్రమాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న గ్రామాలలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందించడమే ఈ సమన్వయ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామస్థాయిలో మూడు రోజుల పాటు క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, రాజు‌నా మరియు అనుబంధ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎంపికైన గ్రామాలలో గ్రామసభలు, ర్యాలీలు మరియు సంఘాల వారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించుకున్నారు.ఈ కార్యక్రమంలో వాూం, ఎనాూం, మండల అధ్యక్షురాలు, మీూదీం, ఘూదీం, ఘూూం,మీ, ఖీమీం, ఐవీమీ మరియు ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## లెప్రసీ కాలనీలో 500 మందికిదుప్పట్లు పంపిణీ



మన గళం డోన్ పట్టణంలో లెప్రసీ కాలనీ చర్చి నందు లిరాయలసీమ వరల్డ్ అండ్ ప్రేయర్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో సేవకుల సదస్సుకు ఆసియా దేశాల కడవరి వర్షపు సంఘాల ప్రతినిధి (మండపేట) బ్రదర్ ధర్మవీర్ పాల్ తల్లి సంగీత పాల్ లెప్రసీ కాలనీ వారికి దుప్పట్లను అలాగే బైబిల్ మిషన్ చర్చి నందు సేవకులకు వృద్ధులకు వితంతువులకు పేదలకు దాదాపు 500 మందికి దుప్పట్లను పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ ప్రెసిడెంట్ ఆదాం, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, భూషణం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



## ఆపిల్ మాక్‌బుక్ ఎయిర్ ఎం4పై 18000 తగ్గింపు..



హైదరాబాద్ , డిసెంబర్ 19, 2025 , మన గళం : ల్యాప్‌టాప్ కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఆపిల్ సంస్థ శుభవార్త చెప్పింది. శక్తివంతమైన ఎం4 ప్రాసెసర్‌తో వచ్చిన మాక్‌బుక్ ఎయిర్‌పై ఈ ఏడాది ముగింపులో భారీ తగ్గింపు అందుబాటులోకి వచ్చింది. మొత్తం మీద 18000 వరకు ధర తగ్గడంతో టెక్నాలజీ అభిమానుల దృష్టి ఈ ఆఫర్‌పై నిలిచింది.ప్రస్తుతం విజయ్ సేల్స్ స్టోర్లలో మాక్‌బుక్ ఎయిర్ ఎం4, 16 జీబీ ర్యామ్ మరియు 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ 91900 ధరకు లభిస్తోంది. కంపెనీ ప్రారంభ ధర 99900 కాగా, దీనిపై నేరుగా 8000 తగ్గింపు వర్తిస్తోంది. దీనికి తోడు ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా 10000 బ్యాంక్ ఆఫర్ తగ్గింపు పొందే అవకాశం ఉంది. ఈ విధంగా మొత్తం 18000 వరకు ఆదా చేసుకోవచ్చు. ఈ ఆఫర్ 13.6 అంగుళాల డిస్‌ప్లే మోడల్‌కు మాత్రమే వర్తిస్తుంది.ఈ మాక్‌బుక్ ఎయిర్ ఎం4 రెండు స్క్రీన్ పరిమాణాల్లో అందుబాటులో ఉంది. 13.6 అంగుళాలు మరియు 15.3 అంగుళాల ఎంపికలు ఉన్నాయి. గరిష్టంగా 500 నిట్స్ వెలుగు తీవ్రతతో డిస్‌ప్లే వస్తుండగా, క్వాడ్ స్పీకర్ ఆడియో వ్యవస్థతో వినోద అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. తేలికైన డిజైన్‌తో పాటు రోజువారీ పనులు, ఆఫీస్ వర్క్, తేలికపాటి ఎడిటింగ్ అవసరాలకు ఇది అనువైన యంత్రంగా నిలుస్తోంది.పాత ఇంటెల్ ప్రాసెసర్ మోడళ్ల నుంచి లేదా ఎం1 మాక్‌బుక్ ఎయిర్ నుంచి అప్‌గ్రేడ్ కావాలనుకునేవారికి ఈ ఎం4 మోడల్ మంచి ఎంపికగా భావిస్తున్నారు. మెరుగైన ఉష్ణ నియంత్రణ, దీర్ఘకాలిక బ్యాటరీ సామర్థ్యం, స్మూత్ పనితీరుతో ఈ ల్యాప్‌టాప్ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. భారీ ధర తగ్గింపుతో లభిస్తున్న ఈ ఆఫర్, 2025 చివర్లో ల్యాప్‌టాప్ కొనుగోలు చేసే వారికి నిజంగా బంపర్ అవకాశంగా మారింది.

## యాషెస్ మూడో టెస్టులో ఆసీస్ పట్టు..

అడిలైడ్ డిసెంబర్ 19, 2025 , మనగళం : యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియాఇంగ్లండ్ మూడో టెస్టు మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 66 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి, తొలి ఇన్నింగ్స్‌తో కలిపి ఇంగ్లండ్‌పై 356 పరుగుల భారీ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది.ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో ట్రావిస్ హెడ్ అద్భుతంగా రాణించాడు. 142 పరుగులతో అజేయంగా నిలిచిన అతడు శతకంతో జట్టును బలమైన స్థితిలో నిలబెట్టాడు. మరోవైపు అలెక్స్ క్యారీ 52 పరుగులతో అజేయంగా నిలిచి హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 122 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌పై ఆసీస్ పట్టు మరింత బలపరిచారు.అంతకుముందు 213 పరుగులకు 8 వికెట్లతో ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 286 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ 83 పరుగులతో జట్టును నిలబెట్టే ప్రయత్నం చేయగా, జోఫ్రా ఆర్చర్ 51 పరుగులు చేసి కీలకంగా రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో పాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ చెరో 3 వికెట్లు తీయగా, నాథన్ లైయన్ 2 వికెట్లు పడగొట్టాడు. కామెరూన్ గ్రీన్, మిచెల్ స్టార్క్ తలో వికెట్ సాధించారు.ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో జేక్ వెదర్లాడ్ 1, లబుషేన్ 13, కామెరూన్ గ్రీన్ 7 పరుగులకే వెనుదిరిగారు. ఉస్మాన్ ఖవాజా 40 పరుగులతో కొంత పోరాటం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2 వికెట్లు తీయగా, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ తలో వికెట్ సాధించారు.మూడో రోజు ముగిసే సరికి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ఆస్ట్రేలియాదేనని స్పష్టమవుతోంది. నాలుగో రోజు ఆటలో ఆసీస్ ఇంకా పరుగులు పెంచి ఇంగ్లండ్‌ను భారీ లక్ష్యంతో ఎదుర్కొనేలా చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

## అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది తో సమావేశం

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాలలో వచ్చే ఖరీఫ్ మరియు రబీ సీజన్ కు ఇప్పటి రబీ సీజన్ కు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడం జరిగిందన్నారు యాక్షన్ ప్లాన్ అనగా గ్రామంలో ఏరియా ఎంత ఉన్నది ఆ ఏరియాలో ఏ ఏ పంట లేస్తున్నారు ఎంత దిగుబడి వస్తున్నది మార్కెట్ రేటు ఎంత ఉన్నది వీటన్నింటిని బట్టి జీవిఏ గ్రామాన్ని నిర్ణయించబడుతోందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు గ్రామాల్లో రైతులకు ఫర్టిలైజర్ రసాయనకరులను అందుబాటులో ఉంచవాలనని తెలిపారు అలాగే పీఎం కిసాన్ అందనటువంటి రైతుల జాబితాను తయారుచేసి పంపించమని వ్యవసాయ సిబ్బంది ని వారుఆదేశించారురబీ సీజన్ సంబంధించి పంట నమోదు యాప్ వచ్చినందువలన యాప్ ను డౌన్లోడ్ చేసుకొని పంట నమోదును త్వరగా తిను స్టార్ట్ చేయవలసిందిగా తెలియజేశారుదీంతోపాటుగా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఉండవలెనని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ



కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు

## గోరంట్ల గ్రామంలో హిందువుల ఆత్మీయ సమ్మేళన సభ జయప్రదం చేయండి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జరుగును కావున అందరూ ఆ కార్యక్రమానికి విధిగా హిందువులంతా విచ్చేసి సభను జయప్రదం చేయవలసిందిగా వారు మనస్ఫూర్తిగా కోరుకున్నారు స్థానికంగా మరియు గోరంట్ల చుట్టుముట్టున్న గ్రామాలకు వారు స్వయంగా కరపత్రాలు అందజేసి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం రోజు జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి మరియు ఆర్ఎస్ఎస్, హైందవ శక్తి సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు ఈ కార్యక్రమానికి దేవాలయ కమిటీ మరియు కుల సంఘ పెద్దలందరిని మరియు స్థానిక ప్రభుత్వ అధికారులను అలాగే గ్రామ పంచాయతీ సిబ్బందిని ఈ సందర్భంగా ఆహ్వానించారు హిందూ సమ్మేళన కార్యక్రమానికి భారీ ఎత్తున హిందూ బంధువులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు కోరుకున్నారు ఈ కార్యక్రమంలో విఠల్ , మదాసి కురువ మద్దిలేటి, ప్యాలకుర్తి వెంకటరాముడు, కుమార్ హరికృష్ణ , మహేంద్ర, బుగుడే శ్రీనివాసులు, సాయ శ్రీనివాసులు, గణేష్ హైందవ సల్వాడి సురేంద్ర, గోరంట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు



## పరోక్ష సేవగా బయలు వీర భద్ర స్వామి వారి విశేష పూజ

మనగళం శ్రీశైలం : ఈ రోజు (19.12.2025) త్రయోదశి సందర్భంగా శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామి వారికి దేవస్థానం విశేషపూజలను నిర్వహిస్తున్నది. ఈ సాయంకాలం పూజాదికాలు నిర్వహించబడుతాయి. ( ఎ ˊ తీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది. కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 30 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, న్యూఢిల్లీ తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు. కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది. ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వ కార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కాగా ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతుంది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ



ట్యూబ్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించబడుతుంది. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 / లను సంప్రదించవచ్చును

## వరుస నష్టాలకు బ్రేక్.. 500 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబయి డిసెంబర్ 19, 2025 మనగళం : వరుసగా 4 రోజుల పాటు నష్టాల్లో కూరుకుపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం బలమైన రికవరీని నమోదు చేశాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో సెన్సెక్స్ భారీ లాభాలతో ముగిసింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ బలపడటం, విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం రూ.600 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయడం మార్కెట్‌కు ఊతమిచ్చాయి.గత ట్రేడింగ్ సెషన్ ముగింపు స్థాయి 84,481తో



పోలిస్తే సెన్సెక్స్ శుక్రవారం ఉదయం దాదాపు 250 పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ ఒక దశలో 85,000 మార్క్‌ను కూడా దాటి ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 84,929 వద్ద స్థిరపడింది.మరోవైపు నిఫ్టీ కూడా అదే బాటలో సాగింది. నిఫ్టీ 150 పాయింట్లు పెరిగి 25,966 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ 156 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 718 పాయింట్ల భారీ పెరుగుదల నమోదు చేసింది.సెన్సెక్స్‌లో టాటా ఎలాక్సీ, వోడాఫోన్ ఐడియా, కేపీఐటీ టెక్నాలజీస్, ఎన్‌బీసీసీ, కేఈఐ ఇండస్ట్రీస్ షేర్లు మంచి లాభాలు ఆర్జించాయి. అదే సమయంలో బ్లూ స్టార్, చోలా ఇన్వెస్ట్, వోల్టాస్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ, నవుమా వెల్త్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.మొత్తంగా చూస్తే.. ఐటీ రంగంపై పెరిగిన మదుపర్ల ఆసక్తి, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయి బలపడటం వంటి అంశాలు కలిసి మార్కెట్‌ను తిరిగి లాభాల బాట పట్టించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఆసియా యూత్ పారా గేమ్స్‌లో హైదరాబాద్ బాలిక ప్రతిభ

హైదరాబాద్ డిసెంబర్ 19, 2025 మనగళం : ఆసియా యూత్ పారా గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారిణి గంగపట్నం విజయ దీపిక అరుదైన ఘనత సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది. టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న దీపిక మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం, మహిళల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది.కేవలం 15 ఏళ్ల వయసులోనే కాంటినెంటల్ స్థాయిలో స్వర్ణం గెలిచిన పిన్న వయస్కురాలిగా విజయ దీపిక ప్రత్యేక గుర్తింపు పొందింది. అత్యంత ప్రతిభావంతంగా, ఆత్మవిశ్వాసంతో ఆడిన దీపిక ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ పతకాలు సాధించడం క్రీడా వర్గాలను ఆకట్టుకుంది. ముఖ్యంగా మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆమె చూపిన చురుకుదనం, సమన్వయం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.విజయ దీపిక తల్లి అరుణ స్వయంగా వెటరన్ టెన్నిస్ క్రీడాకారిణి కావడంతో చిన్ననాటి నుంచే క్రీడల పట్ల దీపికకు సరైన మార్గనిర్దేశం లభించిందని తెలిసింది. తల్లి ప్రోత్సాహం, కఠిన సాధన, పట్టుదలే ఈ విజయానికి కారణమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆసియా యూత్ పారా గేమ్స్ వేదికగా హైదరాబాద్ బాలిక ప్రతిభ మరోసారి వెలుగులోకి రావడం పట్ల రాష్ట్ర క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



# ఫిఫా వరల్డ్ కప్ విజేతకు 450 కోట్ల భారీ బహుమతి

హైదరాబాద్ డిసెంబర్ 19, 2025 మనగళం : 2026 ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు సంబంధించి ఫిఫా కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో జూన్ 11 నుంచి జులై 19 వరకు సంయుక్తంగా జరగనున్న ఈ మెగా టోర్నీకి ప్రైజ్ మనీని రికార్డు స్థాయిలో పెంచుతున్నట్లు ప్రకటించింది. గత వరల్డ్ కప్‌తో పోలిస్తే సుమారు 50 శాతం మేర పెరుగుదలతో మొత్తం 727 మిలియన్ డాలర్లు, అంటే దాదాపు 6500 కోట్ల రూపాయలను బహుమతులుగా కేటాయించనుంది.బుధవారం జరిగిన ఫిఫా కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారిక ఆమోదం లభించింది. ఇందులో సింహభాగమైన 655 మిలియన్ డాలర్లను టోర్నీలో పాల్గొనే 48 దేశాల జట్ల ప్రదర్శన ఆధారంగా పంపిణీ చేయనున్నారు. కొత్త ఫార్మాట్‌లో జట్ల సంఖ్య పెరగడంతో పాటు, బహుమతుల పరిమాణం కూడా గణనీయంగా పెరిగింది.ఈ నిబంధనల ప్రకారం వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టుకు 50 మిలియన్ డాలర్లు, అంటే సుమారు 450 కోట్ల రూపాయలు అందనున్నాయి. ఫైనల్‌లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచే జట్టుకు 33 మిలియన్ డాలర్లు, అంటే దాదాపు 274 కోట్ల రూపాయల బహుమతి ఇవ్వనున్నారు. గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించే 16 జట్లకు కూడా తలా 9 మిలియన్ డాలర్లు అందించనున్నారు.ఇదే కాకుండా వరల్డ్ కప్‌కు అర్హత సాధించిన ప్రతి దేశానికి సన్నాహక వ్యయాల కోసం 1.5 మిలియన్ డాలర్లు ప్రత్యేకంగా చెల్లించనున్నట్లు ఫిఫా వెల్లడించింది. ఈ నిర్ణయంపై ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో స్పందిస్తూ,




2026 వరల్డ్ కప్ ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే ఒక ఆర్థిక మైలురాయిగా నిలవబోతోందని పేర్కొన్నారు. జట్లకు మరింత ప్రోత్సాహం కల్పించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభివృద్ధికి ఇది కీలకంగా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ధోని వారసుడు దొరికేశాడోచ్..

చెన్నై డిసెంబర్ 19, 2025 మన గళం : భారత క్రికెట్‌లో మహేంద్ర సింగ్ ధోని తర్వాత ఆ స్థాయి ఫినిషర్ ఎవరు అనే ప్రశ్న ఎన్నాళ్లుగానో కొనసాగుతోంది. వికెట్ కీపింగ్‌తో పాటు ఒత్తిడిలో మ్యాచ్‌ను ముగించే ఆటగాడు టీమిండియాకు అవసరమన్న చర్చ మధ్యలోనే, ఐపీఎల్ 2026 వేలంలో ఓ యువ క్రికెటర్ పేరు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అతడే కార్తీక్ శర్మ. ధోని వారసుడిగా భావిస్తున్న ఈ యువ ఆటగాడిని చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా రూ.14.20 కోట్ల భారీ ధరకు సొంతం చేసుకోవడంతో క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో రాజస్థాన్‌కు చెందిన 19 ఏళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ కార్తీక్ శర్మ కేవలం రూ.30 లక్షల బేస్ ప్రైస్‌తో బరిలోకి దిగాడు. కానీ వేలం ప్రారంభమైన క్షణాల నుంచే ఫ్రాంచైజీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. చివరకు చెన్నై సూపర్ కింగ్స్ అతడిని రూ.14.20 కోట్లకు దక్కించుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో అంతర్జాతీయ మ్యాచ్ ఒక్కటైనా ఆడని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా ఇంత భారీ ధర పలికిన అరుదైన రికార్డును కార్తీక్ తన ఖాతాలో వేసుకున్నాడు.కార్తీక్ శర్మ ప్రయాణం వెనుక ఎన్నో కష్టాలు, త్యాగాలు దాగి ఉన్నాయి. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన అతడి క్రికెట్ కలల కోసం కుటుంబం భారీ త్యాగాలే చేసింది. శిక్షణ ఖర్చుల కోసం తండ్రి వ్యవసాయ భూమిని అమ్మగా, తల్లి తన బంగారు నగలను తాకట్టు పెట్టింది. ఒక దశలో దేశవాళీ టోర్నమెంట్‌ల సమయంలో డబ్బుల్లేక తండ్రి కొడుకులు నైట్ షెల్టర్లలో గడిపిన రోజులు కూడా ఉన్నాయని తెలిసింది. అలాంటి పరిస్థితుల నుంచి ఐపీఎల్‌లో కోట్ల విలువైన ఆటగాడిగా ఎదగడం చాలా మందికి భావోద్వేగంగా మారింది.ఆట తీరులో కార్తీక్ శర్మను ధోనితో పోల్చడానికి కారణాలు లేకపోలేదు. దేశవాళీ టీ20 టోర్నమెంట్‌లలో






అతడు 160కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ చివరి ఓవర్లలో సిక్సర్ల వర్షం కురిపించాడు. వికెట్ల వెనుక చురుకుదనం, బ్యాటింగ్‌లో ప్రశాంతత, ఒత్తిడిలోనూ మ్యాచ్‌ను ముగించే నైపుణ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ఇదే కారణంగా చెన్నై యాజమాన్యం ధోని తర్వాతి కాలానికి అతడిని సిద్ధం చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.ప్రస్తుతం టీమిండియాలో వికెట్ కీపర్ స్థానానికి పోటీ ఎక్కువగానే ఉన్నప్పటికీ, ఒక పక్కా ఫినిషర్ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఐపీఎల్ 2026లో చెన్నై తరపున కార్తీక్ శర్మ తన ప్రతిభను నిరూపిస్తే, త్వరలోనే అతడిని భారత జట్టు నీలి జెర్సీలో చూడడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కష్టాల కడలిని దాటి వచ్చిన ఈ యువ ఆటగాడు నిజంగానే ధోని వారసుడిగా ఎదుగుతాడా అనే ఉత్కంఠ ఇప్పుడు దేశవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటోంది.

## నేటి ఫైనల్ టీ20పై ఫాగ్ భయం?..

డిసెంబర్ 19, 2025 మన గళం :, భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో కీలకమైన చివరి మ్యాచ్ నేడు అహ్మదాబాద్‌లో జరగనుంది. లక్నోలో జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ దట్టమైన పొగమంచు కారణంగా పూర్తిగా రద్దవడంతో, ఐదో మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉండగా, ఈ మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, సిరీస్‌ను డ్రాగా ముగించాలనే ఆశతో దక్షిణాఫ్రికా బరిలోకి దిగుతోంది.బుధవారం లక్నోలోని భారత్‌రత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి ఎకానా స్టేడియంలో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. స్టేడియం మొత్తం దట్టమైన పొగమంచుతో కమ్మేయడంతో దృశ్యమానత తీవ్రంగా తగ్గిపోయింది. ఫీల్డర్లకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉండటంతో అంపైర్లు పలు మార్లు మైదానాన్ని పరిశీలించి చివరకు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో చివరి మ్యాచ్‌కు కూడా పొగమంచు ప్రభావం ఉంటుందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.అయితే, అహ్మదాబాద్ వాతావరణ పరిస్థితులు లక్నోతో పోలిస్తే భిన్నంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. నరేంద్ర మోదీ స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో పాటు హై స్కోరింగ్ మ్యాచ్‌లకు ప్రసిద్ధి. అహ్మదాబాద్‌లో వాయు నాణ్యత సూచీ 139గా నమోదై, మధ్యస్థ స్థాయిలోనే ఉందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. మ్యాచ్ రోజు సాయంత్రం ఆకాశం నిర్మలంగా ఉండే అవకాశం ఉందని, పొగమంచు లేదా వర్షం




వల్ల ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు.వాతావరణ అంచనాల ప్రకారం మ్యాచ్ సమయంలో ఉష్ణోగ్రతలు 15 నుంచి 30 డిగ్రీల మధ్య ఉండనున్నాయి. విజిబిలిటీ సమస్యలు ఉండవని, అభిమానులు పూర్తి స్థాయిలో మ్యాచ్‌ను ఆస్వాదించవచ్చని అధికార వర్గాలు భరోసా ఇస్తున్నాయి. లక్నోలో ఎదురైన నిరాశ తర్వాత, అహ్మదాబాద్‌లో జరగనున్న ఈ ఫైనల్ టీ20 అభిమానులకు పూర్తి క్రికెట్ మజాను అందించనుందని అంచనా.

## ఒక్క క్యాచ్ డ్రాప్ కొంపముంచింది..



అడిలైడ్ డిసెంబర్ 19, 2025 మన గళం : అడిలైడ్ ఓవల్ మైదానాన్ని తన సొంత అడ్డాగా మార్చుకున్న ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ మరోసారి ఇంగ్లాండ్‌పై విశ్వరూపం చూపించాడు. ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో హెడ్ అద్భుత సెంచరీతో చెలరేగి మ్యాచ్ దిశనే మార్చేశాడు. బాధ్యతాయుతంగా ఆడుతూనే అవసరమైనప్పుడు ఎదురుదాడి చేసిన హెడ్, కేవలం 146 బంతుల్లోనే 11వ టెస్ట్ సెంచరీని పూర్తి చేసి ఆసీస్ అభిమానులను ఉర్రూతలూగించాడు.ఈ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో అలరించిన హెడ్, ఈ యాషెస్ సిరీస్‌లో ఇది తన రెండో శతకం కావడం విశేషం. అంతకుముందు తొలి టెస్టులోనూ సెంచరీతో మెరిసిన అతడు, ఈసారి అడిలైడ్‌లో లీడర్‌లా బాధ్యత తీసుకుని ఇంగ్లాండ్ బౌలర్లకు ఏమీ చేయలేని పరిస్థితి తీసుకొచ్చాడు. హెడ్ బ్యాటింగ్ చూస్తుంటే ఈ టెస్టులో ఇంగ్లాండ్ ఓటమి దాదాపు ఖాయమన్న భావన విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.అయితే ఈ సెంచరీ వెనుక ఒక కీలక మలుపు కూడా ఉంది. హెడ్ 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్ స్లిప్‌లో ఒక సులభమైన క్యాచ్‌ను వదిలేశాడు. అదే క్షణం ఇంగ్లాండ్‌కు పెద్ద దెబ్బగా మారింది. ఆ లైఫ్‌ను పూర్తిగా ఉపయోగించుకున్న హెడ్, తదుపరి బంతికే సింగిల్ తీసి సెంచరీ పూర్తి చేసి మరింత దూకుడు పెంచాడు. ఒక్క క్యాచ్ డ్రాప్ ఇంగ్లాండ్ జట్టును కొంపముంచిందని క్రికెట్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.ఈ సెంచరీతో ట్రావిస్ హెడ్ అరుదైన ఘనతను కూడా సాధించాడు. అడిలైడ్ మైదానంలో వరుసగా నాలుగో టెస్ట్ సెంచరీ నమోదు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ ఘనతను డాన్ బ్రాడ్‌మాన్, మైకేల్ క్లార్క్, స్టీవ్ స్మిత్ మాత్రమే సాధించారు. ఇప్పుడు 2022 నుంచి 2025 మధ్య అడిలైడ్‌లో ఆడిన ప్రతి టెస్టులోనూ సెంచరీ బాదిన హెడ్ కూడా ఆ దిగ్గజాల సరసన నిలిచాడు.మూడో రోజు ఆట ముగిసే సమయానికి ట్రావిస్ హెడ్ 196 బంతుల్లో 142 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆసీస్ జట్టు ఇప్పటికే భారీ ఆధిక్యంలో ఉంది. నాలుగో రోజు ఆటలో హెడ్ ఈ స్కోరును డబుల్ సెంచరీగా మార్చుతాడా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ ఫామ్ కొనసాగితే యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా మరింత పట్టు బిగించడం ఖాయమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

## కోచ్ కంటే మేనేజర్ పాత్రే ముఖ్యము..






న్యూఢిల్లీ డిసెంబర్ 19, 2025 మన గళం :ఆధునిక క్రికెట్‌లో హెడ్‌కోచ్ పాత్రపై టీమిండియా దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ రోజుల్లో కోచ్ అంటే ఆటగాళ్లకు టెక్నికల్ శిక్షణ ఇవ్వడం కంటే, వారిని సరిగ్గా మేనేజ్ చేయడమే ప్రధాన బాధ్యతగా మారిందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో కపిల్ దేవ్ చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేపుతున్నాయి.ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఐసీసీ శతాబ్ది వేడుకల్లో మాట్లాడిన కపిల్ దేవ్, పాఠశాలలు, కళాశాలల్లో బోధించే వారినే అసలైన కోచ్‌లు అని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న లెగ్ స్పిన్నర్, వికెట్‌కీపర్, టాప్ బ్యాట్స్‌మన్‌లకు మళ్లీ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. అలాంటి సందర్భాల్లో కోచ్ కంటే మేనేజర్‌గా వ్యవహరించడమే కీలకమని, ఆటగాళ్లను మానసికంగా ధైర్యంగా ఉంచడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే అసలైన పని అని చెప్పారు.తన కెప్టెన్సీ రోజులను గుర్తు చేసుకున్న కపిల్ దేవ్, శతకం చేసిన ఆటగాడితో కాకుండా ఫామ్‌లో లేని ఆటగాడితో ఎక్కువ సమయం గడపడానికి తాను ఇష్టపడేవాడినని తెలిపారు. అలా చేయడం వల్లే అతడికి మద్దతు, భరోసా లభిస్తుందని, జట్టులో ప్రతి ఒక్కరూ సౌకర్యంగా ఉన్నప్పుడే జట్టు నిజంగా బలంగా మారుతుందని చెప్పారు. కెప్టెన్, మేనేజర్ బాధ్యత కూడా ఇదేనని స్పష్టం చేశారు.ఇదే కార్యక్రమంలో మరో ఆసక్తికర వ్యాఖ్య చేసిన కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ ఈ రోజుల్లో ఆడివుంటే టీ20 క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా నిలిచేవాడని అన్నారు. బలమైన డిఫెన్స్ ఉన్న ఆటగాళ్లకు దాడి చేయడం సులభమని, కానీ డిఫెన్స్‌నే అత్యంత కష్టమైన కళగా అభివర్ణించారు.అదే వేదికపై మాట్లాడిన భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, సొంతగడ్డపై వుమెన్స్ ప్రపంచకప్ గెలవడం భావోద్వేగ క్షణమని చెప్పారు. గతంలో ట్రోఫీలపై ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ పేర్లే కనిపించేవని, ఇప్పుడు భారత్ పేరు కనిపించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రేక్షకుల కేరింతలు వినిపించిన క్షణంలోనే భారత్ నిజమైన ఛాంపియన్‌గా మారిందని తాను అనుభూతి చెందినట్టు మిథాలీ వెల్లడించారు.

# బాల్య వివాహ రహిత భారత్ పోస్టర్ ఆవిష్కరణ

మనగళం, కర్నూలు సిటీ : బాల్య వివాహ నిర్మూలనకు వందరోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు జి. కబర్ధి, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం బాల్య వివాహ రహిత భారత్ బ్యానర్, పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల మూలంగా తమ భవిష్యత్తే కాకుండా పిల్లల భవిష్యత్తు కూడా నాశనం అవుతుందన్నారు. 18 సంవత్సరాల లోపు పెళ్లి చేసుకుంటే బాలిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా గర్భవతి అయితే గర్భంలోనే శిశువు మరణించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ జన్మించిన అంగవైకల్యం లేదా బుద్ధి మాంద్యంతో జన్మించే అవకాశం లేకపోలేదన్నారు. బాల్యవివాహాలు వ్యతిరేకించడం వలనఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఎన్నో నష్టాలు ఉన్నాయని వివరించారు. బాలల సహాయం కోసం విడుదల చేసిన ఈ పోస్టర్లను జిల్లాలోని ప్రతి స్కూల్ నందు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, గ్రేడ్ వన్ సూపర్వైజర్ రాజేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.



# క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ ల పేరుతో సైబర్ మోసాలు

- గిఫ్ట్ కార్డులను గెలుచుకోండని వచ్చే లింకులకు ఆశపడి క్లిక్ చేస్తే మోసపోతారు
- ఇన్ స్టా గ్రాం, ఫేస్బుక్, వాట్సాప్, టెలిగ్రాం వంటి లింకులకు స్పందించకండి
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మనగళం, కర్నూలు క్రైం : క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ లింకుల పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని, ప్రజలు అప్రమతంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. పండుగ సీజన్ ఆన్లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. గిఫ్ట్ ల పేరుతో సోషల్ మీడియా మరియు ఈ మెయిల్స్ లలో లింక్ లు వస్తుంటాయన్నారు. ఆ గిఫ్ట్ కార్డులను గెలుచుకోవాలంటే క్లిక్ చేయండి అని మోసాలు చేస్తుంటారన్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ వ్యక్తిగత సమాచారం, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఓటిపిలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దన్నారు. ఇలా చేస్తే మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా క్లిక్ చేయకుండా ఉండండి. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ ల్యాబ్



పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఒక్క హామీని అమలు చేయని కూటమి సర్కార్

- కర్నూల్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి




మనగళం, కర్నూలు సిటీ : కూటమి సర్కార్ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతోందని కర్నూల్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు, కర్నూల్ ఇన్ చార్జ్ ఎస్వీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేయడమే ఈ ప్రభుత్వ అసలు అజెండా. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం అంటే పేదల భవిష్యత్తును వేలం వేయడమే అని మండిపడ్డారు. కోటి సంతకాల ఉద్యమం ప్రజల ఆక్రోశానికి ప్రతీక. ఇది రాజకీయ కార్యక్రమం కాదుడ ప్రజల మనుగడ కోసం చేసిన పోరాటం అని స్పష్టం చేశారు. ఇంత పెద్ద ఎత్తున ప్రజలు సంతకాలు చేసి వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నోరు విప్పకపోవడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. అవసరమైతే కేంద్రం వరకు ఈ పోరాటాన్ని తీసుకెళ్తాం" అని హెచ్చరించారు. వైసీపీ ప్రజల పక్షాన నిలబడుతుంది. పేదల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడుతుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దాడి కేసులో ముద్దాయికి జైలు శిక్ష, 10 వేల రూపాయలు జరిమానా.

( ఆలూరు మనగళం ):పత్తికొండ డిఎస్పి వెంకట రామయ్య మరియు ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలూరు పోలీస్ స్టేషన్లో క్రైమ్. నెం. 49 /2015 ఖ/రా 326,307 ఐపిసి కేసులో ఆలూరు మండలం, మొల్లగవల్లి గ్రామానికి చెందిన కురువ నౌనేపాటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయ సుధాకర్ పై అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై ధనుంజయ విచారణ జరిపి ఛార్జ్ షీట్ దాఖలు చెయ్యగా ఆదోని గౌరవ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు వారు విచారణ జరిపి నేరం రుజువు కావడంతో జడ్జి ముద్దాయి బోయ సుధాకర్ కు మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు 10 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఆలూరు ఎస్సై మన్మధ విజయ్ తెలిపారు.




## లాంగ్ డ్రైవ్‌లో నిద్ర వస్తుందా?..

హైదరాబాద్ డిసెంబర్ 19, 2025 మనగళం, : లాంగ్ డ్రైవ్ చేసే సమయంలో నిద్ర పట్టడం చాలా ప్రమాదకరం అనే విషయం తెలిసిందే. వరుసగా గంటల తరబడి వాహనం నడిపితే శరీరం అలసిపోతుంది. నిద్రమత్తు వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, డ్రైవ్ మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే హైవేల్లో హోటల్ రూమ్ తీసుకోవాలంటే ఖర్చు ఎక్కువగా ఉండటం, కారులోనే పడుకుంటే సౌకర్యం లేకపోవడం చాలామందికి సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా ఒక కొత్త ఆలోచన అమలులోకి వచ్చింది. హైవేల పక్కన చిన్న చిన్న కంటైనర్లను ఏర్పాటు చేసి, డ్రైవర్లకు తక్కువ ఖర్చుతో పవర్ నాప్ తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈ కంటైనర్లలో ఏసీ, కంఫర్టబుల్ బెడ్స్, దుప్పట్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. లాంగ్ డ్రైవ్ చేస్తున్నవారు గంటసేపు విశ్రాంతి తీసుకోవడానికి కేవలం రూ. 99 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో హైవే వివరాలు నమోదు చేస్తే, సమీపంలో ఉన్న పవర్ నాప్ కంటైనర్ వివరాలు లభిస్తాయి. పేమెంట్ చేసిన వెంటనే ఒక పాస్ కోడ్ వస్తుంది. ఆ కోడ్‌ను కంటైనర్ డోర్ లాక్‌లో నమోదు చేస్తే తలుపు తెరుచుకుంటుంది. గంటపాటు ప్రశాంతంగా నిద్రపోయే అవకాశం ఉంటుంది. ఇలా చిన్నపాటి విశ్రాంతి తీసుకోవడం వల్ల ప్రమాదాల ముప్పు గణనీయంగా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒక్క కంటైనర్‌లో ఒకేసారి 6 మంది వరకు నిద్రపోయే వెసులుబాటు ఉంది. మొత్తం కంటైనర్‌ను ఒక గంట పాటు బుక్ చేసుకోవాలంటే రూ. 399 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నం, చెన్నై వంటి ప్రధాన హైవే మార్గాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.

# జీ రామ్ జీ స్కీమ్ ను రద్దు చేయాలి

- ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను తిప్పి కొట్టండి

మనగళం, కర్నూలు సిటీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన వీబీజీ రామ్ జీ స్కీమ్ ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్ట సవరణకు వ్యతిరేకంగా గాంధీ విగ్రహం ముందు నల్లజెండాలతో నిరసన సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. సీపీఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌస్ దేశాయ్ మాట్లాడారు. 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న వామపక్షాల ప్రోత్బలంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టడం కోసం తెచ్చిన ఈ చట్టాన్ని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులు తెస్తూ క్రమంగా చట్టాన్ని స్కీమ్ గా మార్చి రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న ఈ ప్రభుత్వం పేదల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆయన విమర్శించారు. గత పదేళ్లలో ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ వస్తున్నారని, రెండు పూటల పని విధానం తీసుకుని వచ్చారని, పనిచేసిన కూలీలకు వారంలోగా వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్న నేటికీ ఐదు నెలలైనా బకాయిలు చెల్లించక పోవడం చూస్తుంటే ప్రభుత్వానికి పేదల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని ఆయన విమర్శించాడు. కేంద్ర ప్రభుత్వం అనే పేరుతో తెచ్చిన పథకంలో రాష్ట్ర ప్రభుత్వాలపై భారాలు వేసిందని, ఈ పథకానికి పూర్తిస్థాయి నిధులు కేంద్ర ప్రభుత్వమే భరించాలని చట్టంలో ఉన్నప్పటికీ దానిని తుంగలో తొక్కిందన్నారు. పార్లమెంట్లో అడ్డగోలుగా బిల్లు పెట్టితే మన రాష్ట్రంలో ఉండే 25 మంది అధికార, ప్రతిపక్ష పార్టీల పార్లమెంటు సభ్యులు బిల్లుకు ఆమోదం తెలపడం సిగ్గుచేటని ఆయన విమర్శించాడు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రక్షించుకునేందుకు విబిజి రాంజీ అనే పథకాన్ని రద్దు చేసే వరకు పోరాటాలు చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చాడు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ, పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఏటా పది లక్షల మంది సుధీర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. జిల్లాకు వరంగా ఉన్న ఈ పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం డి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు గురు శేఖర్, ఎన్ అలివేలమ్మ, నగర నాయకులు విజయ్, నగేష్, సాయిబాబా, నరసింహులు, సుధాకారప్ప, ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్ దేశాయ్, కే రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇదే చివరి అవకాశం !

- బీపీఎస్, ఎల్ఆర్ఎస్ అప్రూవల్ చేయించుకోండి
- హెచ్చరించిన కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మనగళం, మంత్రాలయం : రాష్ట్ర ప్రభుత్వం బీ.పీ.ఎస్, ఎల్.ఆర్.ఎస్ అప్రూవల్ తీసుకోవడానికి ప్రజలకు ఇచ్చిన సువర్ణవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసు కుంటామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి శుక్రవారం మంత్రాయలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు పంచాయితీ సెక్రటరీ ద్వారా ఇంటి నిర్మాణం కొరకు అనుమతులు తీసుకుంటూ వ్యాపారం చేస్తున్నారని, ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి వ్యాపారాలు చేస్తున్న వారిని 21 మందిని గుర్తించామన్నారు. వీరికి శాఖాపరమైన నోటీసులు పంపడం జరిగిందని, ఆయా నోటీసులు 21 మందికి ముట్టినప్పటికి నేటి వరకు వారి నుంచి ఎలాంటి వివరణ రాలేదన్నారు. నోటీసులు అందుకున్న వారు వెంటనే కుడా కార్యాలయానికి వచ్చి బిల్డింగ్ అప్రూవల్ కొరకు బీ.పీ. ఎస్, ల్యాండ్ అప్రూ వల్ కొరకు ఎల్.ఆర్.ఎస్ స్కీంలకు దరఖాస్తు చేసుకొని అప్రూవల్స్ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ వ్యాపారాలు చేస్తూ ఆదాయం ఆర్జిస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అనుమతులు లేని ఇంటి యజమానులకు పంచాయితీ కార్యదర్శి నోటీసులు ఇచ్చిన వెంటనే కుడా కార్యాలయానికి వచ్చి అప్రూవల్స్ కు కావల్సిన డాక్యుమెంట్స్, ప్రభుత్వ పరమైన ఫీజును చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమయం ఇంకా 70 రోజులు మాత్రమే ఉందని, ఈ లోపు ఈ అవకాశాన్ని సద్వని యోగపర్చుకోవాలని, లేని పక్షంలో ఈ సారి ఎలాంటి నోటీసులు ఇవ్వ కుండానే బిల్డింగ్ లను కూల్చేస్తామని హెచ్చరించారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.